క్లుప్తంగా

నేడు మండల సమావేశం

సంబేపల్లె : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ నాగశ్రీలక్ష్మి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నరసింహులు తెలిపారు. మండలంలోని ఆయా శాఖల అధికారులు నివేదికలతో హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు. జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరు కావాలని వివరించారు.

పేదలకు చీరల పంపిణీ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ముద్దా రామసుబ్బారెడ్డి

పుల్లంపేట : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, ముద్దా బాబుల్‌రెడ్డి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం మూడు రోజులుగా మండలంలో వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు ముద్దా రామసుబ్బారెడ్డి పేద మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్నారు. ఇందులో భాగం గాగురువారం గారాలమడుగు దళితవాడ గ్రామంలో ఈ కార్యక్రమం చేపట్టారు. సుదర్శన్ రెడ్డి, గారాలమడుగు మాజీ సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కె.చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా పైపులైన్ వేస్తున్నారని ఫిర్యాదు

రామాపురం : తమ పొలంలో అక్రమంగా పైపులైన్ వేస్తున్నారని సోమరాజు రాజేంద్రప్రసాద్‌రాజు గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. లక్కిరెడ్డిపల్లె మండలం మద్దిరేవుల గ్రామం సింగరాజుగారిపల్లెకు చెందిన రాజేంద్రప్రసాద్ రాజు తనకు రామాపురం మండలం బండపల్లె గ్రామంలో సర్వే నంబరు 1346/1లో 4.02 ఎకరాల భూమి ఉందని తెలిపారు. గతంలో తహసీల్దార్ డీ పట్టాను ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. తమ గ్రామానికి చెందిన తన తమ్ముడి కుమారులు సోమరాజు విజయ్‌కుమార్‌రాజు, రవీంద్రకుమార్‌రాజు తనపై దౌర్జన్యం చేస్తున్నారని, తన భూమిలో అక్రమంగా పైపులు వేసేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఈ విషయంపై ముందుగానే పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు అందించినట్లు వివరించారు.

పనులు త్వరితగతిన పూర్తి చేయండి



రక్షణ గోడ పనులు పరిశీలిస్తున్న డీఈ చెంగలరాయుడు

ఓబులవారిపల్లె : తల్లెంవారిపల్లె ఉన్నత పాఠశాల వెనుక వంకను ఆనుకొని నిర్మిస్తున్న రక్షణ గోడ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఇరిగేషన్ డీఈ చెంగలరాయుడు అన్నారు. ఆయన గురువారం ఈ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దాదాపు 60 లక్షల రూపాయల వ్యయంతో వంక రక్షణ గోడ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నాగినేని రమేష్‌నాయుడు, అశోక్‌రెడ్డి, ముజఫర్ తదితరులు పాల్గొన్నారు.

క్రిస్టియన్ మైనార్టీల అభివృద్ధికి సహకరించాలి



మైనార్టీ కమిషన్ చైర్మన్‌ను సత్కరిస్తున్న నేతలు

కలికిరి : రాష్ట్రంలోని క్రిస్టియన్ మైనార్టీల అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మెన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్‌ను వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ విభాగం జిల్లా అధ్యక్షుడు బోనాసి జాన్ బాబు కోరారు. మహల్‌లోని మైనార్టీ కమిషన్ చైర్మెన్ కార్యాయంలో గురువారం ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి క్రిస్టియన్‌ల అభివృద్ధిపై విన్నవించారు. అనంతరం జిల్లా క్రిస్టియన్ మైనార్టీ అవగాహన సదస్సుకు ఆయనను ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ విభాగం నేతలు డాక్టర్ ఆసాది వెంకటరమణ, ఫాస్టర్‌లు విజయశేఖర్, జీవరత్నం, ఎలిసా, సుధాకర్‌రావు, దేవదానం, దినకరన్ పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

పీలేరు : పీలేరు సబ్ డివిజన్ పరిధిలో విద్యుత్ సబ్‌స్టేషన్లలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని ట్రాన్స్‌కో ఈఈ కె. మునిచందర్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తలపుల సబ్‌స్టేషన్ పరిధిలో లైన్‌మెన్ నిర్లక్ష్యంతో ఇద్దరు సిబ్బంది విద్యుదాఘాతానికి గురి కావడం బాధాకరమన్నారు. పీలేరు, కలికిరి, వాల్మీకిపురం, కలకడ, కేవీపల్లె, గుర్రంకొండ, యర్రావారిపాళెం, చిన్నగొట్టిగల్లు మండలాల్లో మొత్తం 50 సబ్‌స్టేషన్లు ఉన్నాయన్నారు. అన్ని సబ్‌స్టేషన్లను తనిఖీలు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీ సుధాకర్ పాల్గొన్నారు.

ఘనంగా గొబ్బెమ్మ నిమజ్జనం



రాజంపేట టౌన్ : గొబ్బెమ్మ ప్రతిమను ఊరేగిస్తున్న ప్రజలు



రాజంపేట టౌన్ : గొబ్బెమ్మ పాటలు పాడుతున్న మహిళలు

రాజంపేట టౌన్ : మండలంలోని వివిధ ప్రాంతాల్లో గురువారం గొబ్బెమ్మ నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గొబ్బెమ్మ ప్రతిమలను పురవీధులు, గ్రామాల్లో ఘనంగా ఊరేగించారు. దారిపొడవునా మహిళలు గొబ్బెమ్మ పాటలను పాడుతూ సాగారు. యువకులు బ్యాండు నృత్యాలకు అనుగుణంగా నృత్యాలు చేశారు. అలాగే పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చారు. పట్టణానికి చెందిన వారు గొబ్బెమ్మ ప్రతిమలను పవిత్ర పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న హత్యరాల మడుగులో నిమజ్జనం చేయగా, గ్రామీణ ప్రాంతాల వారు తమకు సమీపంలో ఉన్న చెరువులు, నీటి కుంటల్లో నిమజ్జనం చేశారు. కనుమ పండుగ మరుసటి రోజు నుంచి నిత్యం మండల వ్యాప్తంగా కొన్ని గ్రామాల్లో గొబ్బెమ్మ నిమజ్జన వేడుకలు జరుగుతుండటంతో.. ఆయా గ్రామాలు, ప్రాంతాల్లో సందడి వాతావరణం నెలకొంటోంది. ఇదిలా వుంటే ఈ నెల 20, 21వ తేదీల్లో గొబ్బెమ్మ నిమజ్జన వేడుకలను పెద్ద ఎత్తున చేపట్టేందుకు అనేక గ్రామాలకు చెందిన ప్రజలు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కనుమ పండుగ మరుసటి రోజు నుంచి గ్రామాల్లో వారం రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

పుల్లంపేట : మండలంలోని తిప్పాయిపల్లి గ్రామంలో గురువారం గొబ్బెమ్మ అమ్మవారి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు పాల్గొని గొబ్బెమ్మ పాటలు పాటారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ముగ్గులో గొబ్బెమ్మను పెట్టి పసుపు, కుంకుమతో పూజలు చేశారు. అనంతరం గ్రామం అంతా తిరిగి గొబ్బెమ్మ పాటలు పాడుతూ అమ్మవారిని సాగనంపారు.

పూత దశలోనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



మామిడి రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానశాఖ అధికారిణి నాగమణి

రాయచోటి టౌన్ : మామిడిలో పూత దశలోనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రాయచోటి ఉద్యాన శాఖ అధికారిణి నాగమణి తెలిపారు. రాయచోటి రూరల్ పరిధిలోని మాధవరం, కాటిమాయకుంట గ్రామాలలో మామిడి రైతులకు పూతదశలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మామిడిలో పూత ఒకే సారి రావడానికి, వచ్చిన పూతలో ఆడ శాతాన్ని పెంచుకోవడానికి 13–0–45 (మల్టీకె) 10 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. అలాగే మ్యాంగో స్పెషల్ 5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. లేదా ఫార్ములా – 4: 5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. మొగ్గ దశలో తేనెమంచు పురుగు, మసి తెగులు, పక్షి కన్ను తెగులు, బూడిద తెగులు ఆశించే అవకాశం ఉంటుంది కాబట్టి మోనోక్రోటోపాస్ 1.6 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని చెప్పారు. దాంతోపాటు మ్యాంకోజెబ్2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని తెలిపారు. తెగుళ్ల నివారణ చర్యలతోపాటు 10 ఏళ్ల వయసున్న చెట్లకు రెండవ సారి ఎరువులు అనగా యూరియా ఒక కిలో,పొటాష్ 750 గ్రాముల చొప్పున భూమిలో వేయాలని చెప్పారు. అలాగే జనవరి, ఫిబ్రవరి నెలల్లో 15 రోజులకు ఒక సారి నీటి తడులు ఇవ్వాలని సూచించారు. పిందెలు గోలీ కాయ దశ నుంచి నిమ్మకాయ దశకు వచ్చే సమయంలో తొడిమ కుళ్లు తెగులు నివారణకు అమిస్టార్ 1 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. అలాగే ఎరువులు వేసిన సమయ కాలంలో 15 రోజులకు ఒక మారు నీటి తడులు ఇవ్వాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైతు భరోసా కేంద్ర వ్యవసాయ సహాయకులు ప్రసన్న, నిరంజన్, రిషిత తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు నివాళి





గాలివీటి కుసుమమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

వీరబల్లె (రాయచోటి టౌన్) : మాజీ సర్పంచ్ గాలివీటి కుసుమమ్మకు రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి నివాళులర్పించారు. వీరబల్లెలోని మాజీ జెడ్పీటీసీ సభ్యుడు, దివంగత గాలివీటి రామకృష్ణారెడ్డి భార్య మాజీ సర్పంచ్ గాలివీటి కుసుమమ్మ బుధవారం మృతి చెందారు. ఆమె అంత్యక్రియలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, మధ్యాహ్నం మేడా మల్లికార్జునరెడ్డి వచ్చి ఆమె మృతదేహానికి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమెకు నివాళులర్పించిన వారిలో ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాజంపేట నియోజకవర్గ నాయకులు విజయసాగర్‌రెడ్డి (మదన్‌రెడ్డి), లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డి, టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్ బాబు, టీడీపీ నాయకుడు మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి తదితులు ఉన్నారు.

గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ



సిద్దవటం : శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ పులిరామ్‌సింగ్



పాల్గొన్న ఎంపీటీసీలు, గ్రామ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఇంజినీరింగ్, డిజిటల్ అసిస్టెంట్లు

సిద్దవటం : సిద్దవటంలోని ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జి.పి.డి.పి)పై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీఓ పులిరామ్‌సింగ్ మాట్లాడుతూ ప్రణాళికలను ఏ విధంగా చేసుకోవాలి, గ్రామ పంచాయతీ నిధులను ఏవిధంగా ఉపయోగించుకోవాలి, వచ్చిన బడ్జెట్‌ను ఏ అంశాలకు ప్రణాళికలు వేయాలనే విషయాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప మండలాధ్యక్షుడు నారపురెడ్డి శ్రీనివాసులరెడ్డి, ఎంపీటీసీలు చంద్రశేఖర్‌రెడ్డి, శివయ్య, మండల కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ నూర్, సర్పంచ్‌లు ఈశ్వర్‌రెడ్డి, జానకిరామయ్య, సర్పంచ్ ప్రతినిధి ఓబులయ్య, గ్రామ పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పల్లెల ప్రగతికి కృషి

చిన్నమండెం : పల్లెల ప్రగతికి కృషి కృషి చేయాలని ఎంపీడీఓ దివ్య తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సుధామాధురి ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ సుపరిపాలన, గ్రామ ప్రణాళిక అభివృద్ధి, గ్రామ సచివాలయ నిధులు, ప్రణాళిక విధానాలపై గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఓ వెంకటసుబ్బయ్య, ఈఓపీఆర్‌డీ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధిపై దృష్టి పెట్టండి

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండలంలోని పంచాయతీల అభివృద్ధిపై ప్రణాళికలు సిద్ధం చేయాలని ఈఓపీఆర్‌డీ బాల కుమార్, సెక్రటరీ సుబ్బరాయుడు అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో జీపీడీపీపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లకు రెండవ రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీలకు అవసరమైన ప్రణాళికను సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది కలిసి సిద్ధం చేయాలన్నారు. 2024–25కు సంబంధించి ఈ అభివృద్ధి ప్రణాళికలు ఈ నెల 31వ తేదీలోపు పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది ఏఈపీఆర్ గంగులయ్య పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తి ప్రదర్శించాలి



గెలుపొందిన జట్టుకు కప్ అందజేస్తున్న అర్బన్ సీఐ, ఏపీఐఐసీ డైరెక్టర్

రాయచోటి టౌన్ : క్రీడాకారులు క్రీడా స్ఫూర్తి ప్రదర్శించాలని అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. రాయచోటి రూరల్ పరిధిలోని నక్కవాండ్లపల్లె సమీపంలో నూతనంగా నిర్మితమైన వైఎస్సార్ క్రికెట్ స్టేడియంలో సంక్రాంతి సందర్భంగా ఏపీఐఐసీ డైరెక్టర్ ఆర్. శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో గురువారం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఐ పాల్గొని క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సమానంగా స్వీకరించాలని పేర్కొన్నారు. అయితే గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. అనంతరం శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని తెలిపారు. విజేతలుగా నిలిచిన కొలిమిట్ట జట్టుకు రూ.30 వేలు, చెన్నముక్కపల్లె జట్టుకు రూ.20 వేల నగదు బహుమతితోపాటు మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు రెడ్డి, ఎంపీటీసీ రామచంద్రారెడ్డి, గ్రామ సర్పంచ్ మమత, మోడల్ స్కూల్ కమిటీ చైర్మన్ హరినాథ రెడ్డి, చెన్నముక్కపల్లె జెడ్పీ హైస్కూల్ కమిటీ అధ్యక్షులు సురేష్‌రెడ్డి, అప్పుడు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చాటిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ములకలచెరువు: జాతీయ స్థాయిలో జరిగిన వేమన పద్యాల పోటీల్లో ములకలచెరువు మండల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ఎంఈఓ వెంకట్రమణ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ వేమన జయంతి సందర్భంగా చిత్తూరు జిల్లా పలమనేరులో తెలుగు సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 100 వేమన పద్యాల పోటీలకు ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఈ రెండు రాష్ట్రాల్లో 1 నుంచి 10 వరకు చదువుతున్న 200 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా అన్నమయ్య జిల్లా ములకలచెరువు మండలానికి చెందిన తేజశ్రీ, శాంతి, చరణ్, ప్రదీప్, సానియా, గౌతమ్, ఓజేశ్వరి, కుషేంద్ర అనే విద్యార్థులు ఏకధాటిగా 100 పద్యాలు చెప్పి సత్తా చాటి బహుమతులు పొందారన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



మాట్లాడుతున్న డీఎం ఆర్‌సీ నిరంజన్

మదనపల్లె సిటీ : విధి నిర్వహణలోని డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలు తప్పకుండా పాటించాలని ఆర్టీసీ–2 డిపో మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ అన్నారు. గురువారం స్థానిక డిపో కార్యాలయంలో రోడ్డు భద్రతా మాసోత్సవాలు పురస్కరించుకుని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఎం మాట్లాడుతూ ఆర్టీసీపై ప్రయాణికులు ఎంతో నమ్మకంతో బస్సు ప్రయాణం చేస్తారన్నారు. ప్రయాణికుల మన్ననలు పొందాలన్నారు. డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్‌ఫోన్‌లో మాట్లాడటం వంటివి చేయరాదన్నారు. ట్రాఫిక్ సిగ్నల్ తప్పకుండా పాటించాలన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో ప్రమాదాలు చేయని డ్రైవర్లను గుర్తించి వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. ఆర్టీసీ తమ సంస్థగా భావించి పని చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మోటివేటర్ రామమూర్తి, సీఐ గీత, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గరీబ్ నవాజ్ ఛట్టీ చదివింపులు



సయ్యద్ ఖాజాపీర్ మస్తాన్‌వలి దర్గాలో చాదర్ సమర్పిస్తున్న చింతల సాయికృష్ణారెడ్డి

వాల్మీకిపురం : స్థానిక సయ్యద్ ఖాజాపీర్ మస్తాన్ వలి దర్గాలో గురువారం గరీబ్ నవాజ్ ఛట్టీ కార్యక్రమాన్ని ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం దర్గాను శుద్ధి చేసి వివిధ రకాల పుష్పాలతో దర్గాను సుందరంగా అలంకరించారు. అనంతరం పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తనయుడు చింతల సాయికృష్ణారెడ్డి చాదర్‌ను దర్గాకు సమర్పించుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆఘా మొహియుద్దీన్, ముస్లింలు సందాని, అజీమ్, కలీమ్, జవాద్ హుస్సేన్, కరీమ్, జబ్బార్ సాహెబ్, ఖాజాపీర్, మౌల, తాహీర్, షబ్బీర్ అహ్మద్, నసీర్ హుస్సేన్, నాయకులు నీళ్లభాస్కర్, కేశవ రెడ్డి, శ్రీధర్‌రాయల్, శ్రీనివాసులు శెట్టి, సత్య తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిన నాయకులు

వాల్మీకిపురం : విజయవాడ నగరం నడిబొడ్డున ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ స్మృతివనంలో నిర్మించిన అంబేడ్కర్ 125 అడుగుల సామాజిక న్యాయ మహాశిల్పం ఆవిష్కరణకు మండలం నుంచి అన్ని కులాల వారు భారీ ఎత్తున తరలి వెళ్లారు. గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి ఉపసర్పంచ్ బిడ్డల కేశవ రెడ్డి ఆధ్వర్యంలో బస్సు బయల్దేరింది. నాయకులు నీళ్లభాస్కర్, రాయుడు, రఘు, ఆనంద, రవి, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

రామసముద్రం : విజయవాడలో ప్రపంచ మేధావి డాక్టర్ బిఆర్.అంబేడ్కర్ విగ్రహావిష్కరణ మహోత్సవానికి గురువారం రామసముద్రం మండలం నుంచి 50 మంది సభ్యులతో కూడిన బృందం బయలుదేరింది. ఎంపీడీవో నారాయణస్వామి జెండా ఊపి బస్సును ప్రారంభించారు. సచివాలయం కన్వీనర్ భాస్కర్, దళిత సీనియర్ నాయకులు గుర్రప్ప, ఎస్సీ సెల్ అధ్యక్షులు కృష్ణప్ప తదిరతులు వెళ్లారు.

22న శ్రీరామ హనుమాన్ యజ్ఞం

మదనపల్లె సిటీ: స్థానిక అమ్మచెరువుమిట్టవద్దనున్న కార్యసిద్ధి అభయాంజనేయస్వామి ఆలయంలో ఈనెల 22న శ్రీరామ హనుమాన్ యజ్ఞం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అయోధ్య శ్రీ రామమందిర ప్రతిష్ఠాపన మహోత్సవం పురస్కరించుకుని ఉదయం 11 నుంచి 1 గంట వరకు యజ్ఞం జరుగుతుందన్నారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

సిమెంటు రోడ్డు ఏర్పాటు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని సంపతికోట పంచాయతీలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి 10 రోజుల క్రితం గడప, గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఈ నేపథ్యంలో ఇదే పంచాయతీలోని ముంతపోగులవారిపల్లిలోని ఓ వీధిలో సిమెంటు రోడ్డు వేయించాలని కోరగా స్పందించిన ఎమ్మెల్యే తక్షణం రోడ్డు వేయాలని అధికారులను ఆదేశించి రోడ్డు పనులు పూర్తి చేయించారు. ఈ రోడ్డు పనులను గురువారం ఎంపీపీ మహమూద్ పరిశీలించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు ఉమాశంకర్‌రెడ్డి, మధు, రవీంద్రారెడ్డి, ఉత్తన్న తదితరులు ఉన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

వాల్మీకిపురం : క్రీడలతోనే మానసిక ఉల్లాసం లభిస్తోందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి నరేంద్ర కుమార్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చింతపర్తికి చెందిన కోటపల్లి అనసూయమ్మ, కోటపల్లి రెడ్డెప్ప రెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారుడు కోటపల్లి సనోంద్ర రెడ్డి ఆధ్వర్యంలో మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన వారికి బహుమతులను అందించారు. ఈ టోర్నమెంట్‌లో మొదటి బహుమతి రూ.15,116లు, రెండవ బహుమతి 10,116లు అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో చింతపర్తి గ్రామ ప్రజలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

కడప కల్చరల్ : స్థానిక దేవునికడపలోని శ్రీ సోమేశ్వరస్వామి ఆలయ హుండీ సొమ్మును గురువారం ఆలయ ప్రాంగణంలో లెక్కించారు. కడప గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ కార్యనిర్వాహణాధికారి ఎ.శ్రీధర్ పర్యవేక్షణలో, సీకే దిన్నె ఏఓ పి.సురేష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో 2023 అక్టోబరు నుంచి ఇప్పటి వరకు రూ. 66,847 లభించిందని వారు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించండి



రికార్డులు పరిశీలిస్తున్న కుష్టు వ్యాధి నివారణ అధికారి శైలజ

రామాపురం : కుష్టు వ్యాధిగ్రస్తులను సమగ్రంగా గుర్తించాలని కడప జిల్లా కుష్టు వ్యాధి నివారణ అధికారి డాక్టర్ శైలజ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కుష్టు వ్యాధిగ్రస్తులు ఎంత మంది ఉన్నారో.. గ్రామాలలో ఇంటింటికి సిబ్బంది వెళ్లి సర్వే చేసి గుర్తించాలన్నారు. మండల వ్యాప్తంగా ఎంత మంది ఉన్నారనే వివరాలను స్థానిక మండల వైద్యాధికారి వినోద్‌కుమార్, దివ్యశ్రీలను అడిగి తెలుసుకున్నారు. పాతవి 3, కొత్తవి 2 మొత్తం 5 కేసులు ఉన్నట్లు వారు తెలియజేశారు. గురువారం 20 మంది అనుమానితులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పిలిపించి వైద్య పరీక్షలు చేయగా రెండు కేసులు బయటపడినట్లు పేర్కొన్నారు. రోగులకు మందులు సక్రమంగా అందించాలని కుష్టు వ్యాధి నివారణ అధికారి తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత ‘అడగళ్లు’



విజేతకు ట్రోఫీ అందజేస్తున్న సమన్వయకర్త నిసార్‌అహ్మద్, చైర్‌పర్సన్ మనూజారెడ్డి

మదనపల్లె : క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయ కర్త నిస్సార్‌అహ్మద్ అన్నారు. మదనపల్లె మండలం చిప్పిలి గ్రామంలో రెండురోజులుగా నిర్వహించిన చిప్పిలి వాలీబాల్ టోర్నమెంట్–2024 గురువారం తుదిదశకు చేరుకుంది. టోర్నమెంట్ ఫైనల్స్ పోటీలకు ముఖ్యఅతిథులుగా మల్లయ్యకొండ ఆలయ కమిటీ మాజీచైర్మన్ కనుగొండ మద్దిరెడ్డి, జెడ్పీటీసీ ఉదయ్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి హాజరయ్యారు. వైఎస్సార్ సీపీ సమన్వయ కర్త నిసార్‌అహ్మద్‌తో కలిసి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఫైనల్ మ్యాచ్‌లో చిప్పిలి జట్టుపై అడగళ్లు జట్టు 25 స్కోరుతో గెలుపొందింది. ఫైనల్స్ విజేతకు రూ.12వేలు, రన్నర్స్‌కు రూ.10వేలు, మూడోస్థానంలో నిలిచిన జట్టుకు రూ.4వేలు, నాలుగోస్థానంలో నిలిచిన జట్టుకు రూ.1,000 అందజేశారు. కౌన్సిలర్ గిరిజ, సాయి శేఖర్‌రెడ్డి, చిప్పిలి యూత్ శశికుమార్, చిన్నా, వేణు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ ఆటల పోటీలకు ఎంపిక



క్రికెట్ జట్టును అభినందిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పెద్దమండ్యం : మండలంలోని గ్రామ సచివాలయాల పరిధిలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా పోటీలలో ఆయా విభాగాలలో విన్నర్‌లుగా నిలిచి నియోజకవర్గ పోటీలకు ఐదు జట్లు ఎంపికైనట్లు ఎంపీడీఓ శ్రీధర్‌రావు తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా పోటీలలో గ్రామస్థాయి నుంచి యువత క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలలో పోటాపోటీగా పాల్గొన్నట్లు తెలిపారు. మండలస్థాయిలో క్రికెట్‌లో విన్నర్‌గా బండమిదపల్లె జట్టు నిలిచిందన్నారు. అలాగే ఖోఖో, బాడ్మింటన్, కబడ్డీ, పోటీలలో కలిచెర్ల జట్లు , వాలీబాల్‌పోటీలలో పెద్దమండ్యం పంచాయతీలోని చెరువుకిందపల్లె జట్టు నిలిచినట్లు తెలిపారు. మండల స్థాయిలో విన్నర్‌లుగా నిలిచిన జట్లు ఈ నెల 24 నుంచి నియోజకవర్గ స్థాయిలో జరిగే ఆటల పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

కేంద్ర పథకాలు సద్వినియోగం చేసుకోండి

పీలేరు : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ జీనత్‌షఫీ అన్నారు. గురువారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో వికసిత్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గురించి వివరించారు. అనంతరం ఈవో వరప్రసాద్‌రెడ్డి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రవి, బీజేపీ నాయకులు పాత్తూరి శ్రీకాంత్, రమణ, డ్వాక్రా మహిళలు, గ్రామ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

కేవీపల్లె : వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై గర్నిమిట్ట, మోటుపల్లెవాండ్లపల్లెలో గురువారం అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి పలు పథకాలపై అవగాహన కల్పించారు. జెడ్పీటీసీ గజ్జల శృతి, సర్పంచ్ రమణమ్మ, బీజేపీ నాయకులు గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సేవలు అందించడమే లక్ష్యం

కలకడ : కుటుంబ బీమా, వ్యక్తి గత బీమా, ప్రమాద బీమా, పేద కుటుంబాలకు రాయితీ పై పరిశ్రమల ఏర్పాటు, రాయితీరుణాలు మంజూరు వంటి 18రకాల సేవలను అందించడమే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర లక్ష్యమని ఎంపీడీఓ రమేశ్వర్‌రెడ్డి, కన్వీనర్ కమలాకర్‌రెడ్డి లు అన్నారు. మండలంలోని కలకడ, బాలయ్యగారిపల్లె పంచాయతీలలో సర్పంచ్‌లు ఫ్యారీజాన్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. మండల కో–ఆప్షన్‌సభ్యులు ఇనాయతుల్లా, రాజంపేట పార్లమెంటరీ కార్యదర్శి షావత్ అల్లీఖాన్, కలకడ టౌన్‌కన్వీనర్ కరీముల్లా, ప్రకాష్‌రెడ్డి, బిజెపి నాయకులుకోన చిన్నప్పనాయుడు, ఆంజినేయులునాయుడు పాల్గొన్నారు.